ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

# సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

## 'అనంతజీవనం' నవల - యెద్దీరప్ప పాత్ర నైతిక వ్యక్తిత్వం

**డా. పొనుగోటి రవికుమార్,**

అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు,

ఎస్.ఆర్ & బి.జి.యన్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ & పిజీ కళాశాల(A),

ఖమ్మం,తెలంగాణ.

**Article Received: 25/12/2024 Article Accepted: 26/01/2025 Published Online: 28/01/2025**

**DOI:10.53414/Sahithyatharangini.2025.2106**

**స్థూల పరిచయం:** వర్ణధర్మ నవలలకు ప్రతిఘటన దళిత నవల. అభ్యుదయ సాహిత్యం విరివిగా వస్తున్న కాలంలోనే 1948 లోనే మహాకవి గుర్రం జాషువా 'చిన్నా నాయకుడు' నవల రాశారు. ఆ తర్వాతి కాలంలో ఆచార్య కొలకలూరి ఇనాక్ నవల రచన 1950 దశకం నుంచి మొదలైంది. ఆయన రాసిన నవలల్లో తొలినాళ్లలో అభ్యుదయం, స్త్రీ సమానత్వం, విద్యాభివృద్ధి, సంఘసంస్కరణ అభిలాష కనిపించేవి. అన్ని నవలల్లో కుల సమస్య అంతర్లీనం చేయడం ఇనాక్ రచనలలో కనిపిస్తుంది. 1960 దశకంలో దళితవాదం మొదలైంది. దళితవాదానికి ప్రారంభ సూచికంగా ఇనాక్ రచనల్లో కులసమస్యను ప్రధానవస్తువుగా చేసుకోవటం కనిపిస్తుంది. విప్లవసాహిత్యం విరివిగా వస్తున్న కాలంలో కూడా ఇనాక్ సాంఘిక సమస్యలను చర్చించాడు.

**కీలక పదాలు:** నవల, వర్ణధర్మ, దళితవాదం, నవల, స్త్రీ సమానత్వం.

**నవల విమర్శ:** తెలంగాణ వాదం బలంగా వస్తున్న సందర్భంలో రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలు ప్రత్యేకంగా ఆయా ప్రాంతాల చరిత్రను సాహిత్య సాంస్కృతిక గత వైభవాన్ని అన్వేషించుకొని పునర్నిర్మించే ప్రయత్నం చేయడం జరిగింది. వల్లంపాటి వెంకటసుబ్బయ్య రాయలసీమ సాంఘిక సాంస్కృతికచరిత్రను నిర్మించే కృషి చేశాడు. ఆయన తర్వాత బండి నారాయణస్వామి నిర్మాణాత్మక కృషి చేశాడు. రాయలసీమ ప్రాదేశికచరిత్రలో సంస్కృతి పరమైన విషయాలు ముఖ్యపాత్ర పోషించాయి. నిజానికి సాంఘిక జీవనంలో గుణాత్మకమైన మార్పులను కోరుతూ మధ్యయుగాల నుంచి అక్కడ అనేక సాంస్కృతిక సాహిత్య ఉద్యమాలు జరిగాయన్నది నిజం. అన్నమయ్య, త్యాగరాజు, క్షేత్రయ్య వంటి వాగ్గేయకారులు పోతులూరి వీరబ్రహ్మం, సిద్ధయ్య, కక్కయ్య, వేమన వంటి అనేకమంది సంస్కరణవాదులు రాయలసీమ ప్రాంతంలో పుట్టి పెరిగినవాళ్లే. అన్నమయ్యది సంస్కరణ దృష్టి. వేమన్న ,పోతులూరి వీరబ్రహ్మం, కక్కయ్య, సిద్ధయ్య వరకు అందరూ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ఆలోచనలు ప్రచారం

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

చేశారు. రాయలసీమ మీద లింగాయత్‌ఉద్యమం ప్రభావం కూడా బలంగా ఉండేది. అందువల్ల అనేక తాత్విక ఉద్యమాలకు సాంస్కృతిక ఆందోళనలకు రాయలసీమ ప్రాంతం కేంద్రంగా ఉండేది. కాబట్టి రాయలసీమ ప్రజలలో కనిపించే అనేక భావోద్వేగాలకు లోతైన అర్థాలు ఉంటాయి.

నిజానికి తెలంగాణ, కోస్తాంధ్ర ప్రాంతాల కన్నా ప్రత్యేకమైన చరిత్ర, సామాజిక రాజకీయ పరిస్థితులు రాయలసీమలో ఉన్నాయి. భౌగోళిక నిర్మాణం రీత్యా కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలతో సరిహద్దులు కలిగిన ప్రాంతం. కావున తమిళ కన్నడభాషల ప్రభావం ఉంది. అదేవిధంగా తురుష్కులు, మొగలాయిలు పాలించటం వల్ల ఉర్దూభాష ప్రభావం కూడా చాలా ఎక్కువే ఉంటుంది. అన్ని రకాల దోపిడీలకు గురై ప్రకృతి వల్ల ప్రత్యేకమైన సాంస్కృతి జీవన విధానము, ఆలోచన విధానము రాయలసీమలో కనిపిస్తుంది. అందుకే రాయలసీమ రచయితలు తమ ప్రత్యేక అస్తిత్వాన్ని వ్యక్తీకరణను ఆకాంక్షించారు. రాయలసీమ ప్రాంత చారిత్రక అవగాహన లేకుండా అక్కడి రచయితల సాహిత్యాన్ని మనం అర్థం చేసుకోలేము.

రాయలసీమ ప్రాదేశికతత్వము రూపొందడానికి అనేక విషయాలు దోహదమవుతాయి. చరిత్ర సామాజిక రాజకీయ ఆర్థిక విషయాల మేళవింపు వల్ల ఒక ప్రాంతానికి ప్రత్యేకమైన తత్వము లేదా స్వభావము ఏర్పడతాయి. రాయలసీమ ప్రాంతానికి అలాంటి ప్రత్యేకత ఉంది. రాయలసీమలోని బహుజన సమాజానికి ప్రత్యేకమైన చరిత్ర ఉంది. రాయలసీమలోని భూస్వామ్య కులాలు ఏర్పడడం వెనుక అనేక చారిత్రక కారణాలు ఉన్నాయి. పాలెగాళ్ళ వ్యవస్థలోకి రెడ్డి, కమ్మ కులాలు ప్రవేశించక పూర్వం బోయ, మాదిగలే పాలెగాళ్ళు. కలెక్టర్కు సమానార్థకమైన పాలెగాళ్ళ వ్యవస్థను అగ్రకులాలు ప్రవేశించడంతో స్వార్థ ప్రయోజనాల కోసం ఆ వ్యవస్థను భ్రష్టు పట్టించరని నాగప్పగారి సుందరరాజు పేర్కొన్నాడు.

అయితే అప్పటికి రాయలసీమ సాహిత్యం రాజకీయాలు అగ్రకులాల చుట్టూ తిరుగుతున్నాయి. అగ్రకుల భూస్వాములు కులవ్యవస్థను నిలబెట్టాలని చూస్తున్నారు. అధిపత్య అగ్రకులవ్యవస్థను గట్టిగా ఎదిరించిన కింది కులాలైన బోయ, మాదిగ వంటి కులాలు కూడా చివరికి ఫ్యాక్షన్ గొడవల్లో కూరుకుపోయే స్థితి వచ్చింది. ఈ పరిస్థితిని నిరసిస్తూ దళిత, బిసి కులాలు రచనలు చేస్తున్నారు. దళితులు కుల సమాజాన్ని కూలదోయాలని ఆశిస్తున్నారు. ఈ చైతన్యం కలగడానికి ఆచార్య కొలకలూరి ఇనాక్ ఎంతో కృషి చేశారు. స్పష్టమైన మాదిగదృక్పథంతో నాగప్పగారి సుందరరాజు కవిత్వము, కథలు వెలువరించారు. చిలుకూరు దేవిపుత్ర, బండి నారాయణస్వామి వంటి ప్రఖ్యాత రచయితలు నవలలు, కథలు, కవిత్వము వెలువరించారు. ముఖ్యంగా నవలా సాహిత్యాన్ని రాయలసీమ రచయితలే విశాలం చేశారు. తెలుగు నవల ప్రక్రియలోకి రాయలసీమ బహుజన రచయితలు అనేక కొత్త విషయాలు ప్రవేశపెట్టారు. పాఠక లోకాన్ని సరికొత్త ఆలోచనలకు గురి చేశారు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

ఆచార్య కొలకలూరి ఇనాక్ రాసిన 'అనంత జీవనం' రాయలసీమలోని ఫ్యాక్షనిస్టు సంస్కృతిని రాజకీయాలను చిత్రించింది. ఫ్యాక్షన్స్ స్వరూపాన్ని దాన్ని ఎదుగుదలను కీర్తిస్తూ దాని పతనాన్ని సూచిస్తూ వర్షాన్ని ప్రతీకగా తీసుకొని వర్ణించటం జరిగింది. ఫ్యూడల్ వ్యవస్థ లక్షణమైన ఫ్యాక్షనిజం ఎలా పుట్టింది, ఎంత హింసకు కారణమైంది, ఎలా పతనమయింది. వాటి విషయాలను ఈ నవలలో చిత్రించాడు. ఫ్యూడల్ వ్యవస్థ శిథిలావస్థకు చేరుకుంది. ఆ శిధిలమైపోతున్న ఫ్యాక్షనిస్ట్ ఫ్యూడల్లిజం కూలిపోవాలి. రెడ్లు ఫ్యాక్షనిస్టులుగా అణగారిన వర్గాలను అణిచివేస్తున్నారు. బహుజనులందరూ చైతన్యవంతులై ఆ తుఫానులో ఫ్యాక్షనిజం కొట్టుకుపోవాలని రచయిత ప్రతీకాత్మకంగా ఉద్దేశించారు. అందుకే అనంతపురంలో కురిసిన వానను ఒక ప్రతీకగా తీసుకొని ఆచార్య కొలకలూరి ఇనాక్ ఈ నవల రాశారు.

**అనంత జీవనం** నవలలో అనంతపురం పట్టణ ప్రజలు జీవితపు వెలుగునీడల చిత్రణ ఉన్నది. ఇంకా అనంతపురం అక్కడి కరువు కాటకాలు ఉన్నాయి. పాలెగాళ్ళ సంస్కృతి కాలంలో పాటు పట్టణ విస్తరణ పెరిగి నాగరికత దాని వలన వచ్చిన ఇక్కట్లు వర్ణించారు. మరియు ముఖ్యంగా అణగారిన అట్టడుగు వర్గాల కష్టాలు కన్నీళ్లులో రాయలసీమ కరువుజిల్లాల్లో అనంతపురం మొదటిది. అలాంటి అనంతపురంలో భారీ వర్షమా, ఊరువాడ మునిగిపోయే వర్షమా, ఆశ్చర్యం సహాయక చర్యలు చేయలేక ప్రభుత్వం చేతులెత్తేసింది. ఆ వరద బీభత్సంలో తాగడానికి గుక్కెడునీళ్లు కరువయ్యాయి. ఇల్లు కూలి మనుషులు చనిపోయే వర్షంలో సామాన్యుడి నుండి ధనవంతుడి వరకు ఎలాంటి జీవనం గడిపారో అనంత జీవనం నవలలో ఇనాక్ తెలియజేశారు. అనంతపురంలో తేది: 09.11.1996న వచ్చిన తుఫాను సృష్టించిన బీభత్సంలో సంపన్నులు, సామాన్యులు ఎదుర్కొన్న అత్యాయక పరిస్థితిని సంపన్నుల పూర్వాపరాల సంఘర్షణను సామాన్యుల జీవనపోరాటాలను 'అనంత జీవనం' నవలలో చిత్రించానని సింహావలోకంలో రచయిత స్వయంగా పేర్కొంటారు.

అనంత జీవనంలో ఇనాక్ గారు ఫ్యాక్షనిస్టుల జీవితాలను వారి జీవితాల్లోని విలాసాలను కిందికులాల జీవితాల మధ్య ఉన్న వ్యత్యాసాలను వర్ణించారు. ఇద్దరు అనుకోని తుఫానులో చిక్కుకొని ఏ విధంగా ప్రవర్తించారో తెలియజేశారు. పారిశుద్ధ్య కార్మికులైన మాదిగలు ప్రముఖపాత్ర వహించి నగరంలో ఉన్న చెత్తను తొలగించడానికి బహుజనులను కలుపుకొని ఐక్యంగా ఉండి అనంతపురాన్ని వరద ముప్పు నుండి కాపాడుకుంటారు. ఈ సందర్భంగా యద్దీరప్ప పాత్ర నైతిక ప్రవర్తన ప్రతీకాత్మకంగా రచయిత మన కళ్ళ ముందు ఉంచుతాడు.

**యద్దీరప్ప** బేలుదారి మేస్త్రి, మాదిగ కులస్తుడు. అతని కింద పాతికమంది కట్టుబడి బేల్దారులు పదిమంది పనివాళ్ళు 40 మంది, ఆడవాళ్లు పాతికమంది పిల్లలు పనిచేస్తుంటారు. ఏ పని ఎవరు చేయాలి. ఎక్కడ చేయాలని పనులు పురమాయిస్తుంటాడు. యద్దీరప్పకు పని అప్పగిస్తే తాము నిశ్చింతగా ఉండవచ్చునని

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

యజమానులను నమ్మకం. అతని దగ్గ పని చేస్తే సుఖశాంతులు ఉంటాయని పనివాళ్ళ భావన. మిగిలిన ఇంటిపని చేసే ఇసుక, చెక్కవాళ్ళు ఇంటి యజమానితో మాట్లాడరు. యద్దీరప్పతోనే మాట్లాడతారు. వాళ్లకు యద్దీరప్పే బట్వాడా ఇప్పిస్తాడు. పనులు చేసే వాళ్లకు యజమానులకు మధ్య వారిధిగా ఉండి అందరి నమ్మకాన్ని విశ్వాసాన్ని చూరగోన్నాడు.

**యద్దీరప్ప** ఎవరినీ తిట్టడు, మాట తూలడు, కోపాలు తెచ్చుకోడు. 65 ఏళ్లగా బేల్దారి పనులలో రాటు తేలేడు. 15 ఏళ్ల వయస్సులో ఈ పనిలో చేరాడు. కానీ అతనికి ఆడవాళ్ళ బలహీనత, అంతా బేలుదారి పనికి వచ్చే ఆడవాళ్లే. అలా పరిచయమై వదలకుండా ఉన్నవాళ్లను పెళ్లాలన్నాడు. వారికి వేరువేరుగా ఇండ్లు కట్టించాడు. అలాంటి వారు ఐదుగురు భార్యలు ఉన్నారు. యద్దీరప్పకి 85 సంవత్సరాలు ఉంటాయి. చిన్న శబ్దం కూడా వినపడుతుంది. కంటిచూపు తగ్గలేదు. ఇప్పటికీ తిండిపుష్టి తగ్గలేదు. కాయ పారుమనిషి, కష్టజీవి, కండలు తిరిగిన శరీరం పదేళ్ల కిందట ఐదవ ఆమెను చేరదీశాడు. ఇల్లు కట్టాడు. ఇద్దరు పిల్లలు పెద్దవాళ్లు నలుగురు భార్యలు బతికే ఉన్నారు. వాళ్ళకి పిల్లలు ఉన్నారు. మనవాళ్లు మనవరాళ్లకు అందరికీ పెళ్లయి పిల్లలు ఉన్నారు. నాగలచ్చమ్మకి 47 దాటి ఉండవు ఇప్పుడు పనికి పోతూనే ఉంది. బేల్దారికూలీగా పనిచేస్తున్నారు. ఆమెకు ఇల్లు కట్టించడానికి ఎక్కడా స్థలం దొరకక వంక పోరంబోకు స్థలం ఆక్రమించి మేరకుపోసి బండరాయితో గట్టుకట్టి దానిపై ఇల్లు కట్టాడు. వరద ఉధృతికి ఆ ఇల్లు పడిపోయింది. ఐదోభార్యకు, ఆమె పిల్లలకు ఏమి కాలేదు. యద్దీరప్ప ఐదవభార్యను పిల్లలను కలప పనిచేసే ఖలందర్ ఇంట్లో కొంతకాలం తాత్కాలికంగా ఉండమన్నాడు.

అనంతపురంలో 50 ఏళ్ల నుంచి కట్టిన వాటిలో పదో వంతు యద్దీరప్ప కట్టినవే. తాను కట్టిన ఇళ్ల పరిస్థితి ఎలా ఉందోనని నలుగురు మేస్త్రీలను వెంటబెట్టుకొని వానలో ఊరంతా తిరిగాడు. గతంలో కట్టిన ప్రస్తుతం కడుతున్న ఇళ్లకు ఎటువంటి ప్రమాదం లేదు. వాళ్ల యద్దీరప్ప వచ్చి ఇండ్ల యోగక్షేమాలు కనుక్కోవడం యజమానులకు ఆనందంగా ఉంది. మిగిలిన నలుగురు భార్యల ఇల్లు భద్రంగానే ఉన్నాయి. ఐదవ భార్య ఇంటికి అవస్థ. మాదిగోడు మొగోడు! మొనగాడా!ఐదుగురు పెళ్ళాలా! అని ఎవరెవరో తూలనాడారు. అంత మంచివాడికి ఆ బలహీనతే లేకపోతే వంకలో ఇల్లు కట్టే పనే పడేది కాదు. అది కూలిపోయేదే కాదు. యద్దీరప్ప సొంతఇల్లే పడిపోయింది. ఇక మన ఇల్లు ఏం కట్టించగలరని ఇల్లు కట్టించుకోదలచిన వాళ్ళు సందేహించే అవకాశం వచ్చే స్థితి రాకుండా ఉండేదని కొంతమంది అనుకున్నారు.

కానీ యద్దీరప్ప తాను కట్టిన ఇల్లు పడిపోయినందుకు క్షణకాలం బిత్తర పోయాడు. అయితే తన ఇల్లే పడిపోయినందుకు దుఃఖించలేదు. వంకలో ఇల్లు కట్టడం అనేది ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న తప్పేనని నిర్ధారించుకున్నాడు. మళ్ళీ గట్టి ఇల్లు కట్టిస్తా లేమ్మని ఐదవభార్య నాగలచ్చమ్మకు వాగ్దానం చేశాడు. తప్పకుండా మాట

నిలబెట్టుకునే మనిషి. ఎందుకంటే వంకలో ఇల్లు కట్టడం తప్పని తెలుసుకున్నాడు. ఇల్లు కట్టే పనిలో తన శక్తి సామర్థ్యాల మీద విశ్వాసం సడలలేదు. కానీ జనంలో అవిశ్వాసం కలుగుతుందేమోనని శంఖ పట్టుకుంది. నాగలచ్చమ్మ ఇల్లు ముందు గట్టిగా కట్టాలి. ఆపైన ఒప్పుకున్న పనులు మరింత శ్రద్ధగా పూర్తి చేయాలి. వయస్సు పై పడుతుండగా ఈ పని మానుకోవాలని యద్దీరప్ప ఆలోచనలోపడ్డాడు. కానీ ఈ పని లేకపోతే ఇంకొక పని చేయలేడు. వేరొక పని చేసి బ్రతుకలేడు. అందుకే యద్దీరప్ప తన మేస్త్రీలతో ఎక్కడెక్కడ తన అవసరం ఉందో అక్కడ పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నాడు.

**యద్దీరప్పపాత్ర**ను ఎంతో ఉన్నతమైనదిగా రచయిత ఇనాక్ గారు చిత్రీకరించారు. గృహనిర్మాణం అంటే పట్టణాన్ని కొత్తగా నిర్మించడమనే అర్థం. తాను నిర్మించిన ఇల్లులు తుఫాను వానకు కూలిపోయాయోమోనని గమనించాడు. అంటే ఇది తనను తాను పరిశీలన చేసుకోవడం. ఇక్కడ ఇల్లు కట్టడం అంటే ఉద్యమాన్ని నిర్మించడం గానే భావించాలి. ఉద్యమక్రమంలో తన ఇల్లే కూలిపోవడానికి తనను తాను ఆత్మపరిశీలన చేసుకొని నైతికంగా ఎదగడానికి కృషి చేశాడని చెప్పవచ్చు. వర్షం ఇక్కడ నిరంతర చైతన్యానికి ప్రతీక. అనంతపురం ఎడారిగా మారడానికి మనుషులు నైతికంగా పతనం కావడాన్ని సూచిస్తుంది. నైతికంగా పతనం అయ్యారు కాబట్టే అనంతపురంలో అడ్డదిడ్డంగా ఆక్రమాలు వెలిశాయి. వర్షం తుఫానుగా మారడం చైతన్యం ఉద్యమ స్థాయిని చేరుకోవడంగా చెప్పుకోవచ్చు. ఆ ఉద్యమంలో మాదిగలు మిగతా బహుజనలను కలుపుకొని పట్టణాన్ని వరదకు బలికాకుండా కాపాడగలిగారు. ఆ క్రమంలో పట్టణంలోని ధనవంతులు, సామాన్యులు కులాలవారిగా వృత్తులువారీగా ఎలా ఇబ్బందులు ఎదుర్కొన్నారో తెలియజేశారు. అదే సమయంలో ధనవంతులతో పాటు వర్షంవల్ల అణగారినకులాలు కూడా ఇబ్బందులు పడతాయి. కానీ అది ఉద్యమంలో ప్రధానమైన అంశము కాదు.

అనంత జీవనం నవలలు ఇనాక్ గారు నాగన్న, పాకీ మనిషి పాత్రల ద్వారా సమాజంలో బాగా వేళ్ళూనిన కులవ్యవస్థను అందులోని దుర్మార్గాలను కళ్ళకు కట్టినట్లు చిత్రించారు. ప్రత్యేకంగా గొర్లమందను కాపాడే అంకాలప్ప పాత్ర. అలాగే అక్కడి ప్రజలకు తాము చేస్తున్న పనిలో నిబద్ధతతో నిజాయితీతో ఉంటారన్న దానికి సాక్ష్యంగా యద్దీరప్ప, ఉత్తప్ప, సాలమ్మల పాత్రలను తీసుకొని వారిని వర్తమాన జీవితప్రతిబింబాలుగా చూపారు. 'రాయలసీమ జనజీవనాన్ని చిత్రించిన అనంతజీవనం' అనే వ్యాసంలో శ్రీమతి బి.టి.మాధవి చక్కని పరిశీలన చేశారని చెప్పవచ్చు. వర్షం సమానత్వానికి ప్రతీకని దానికి రాజు పేద అనే తేడా ఉండదని జమీందారుల కభందహస్తాల్లో అణిచివేతకు గురై సమానత్వం,సోదరభావం పీడితవర్గాల ఆశయంగా ఆకుల శ్రీకృష్ణ 'వర్షంలో అనంతపురం' అనే వ్యాసంలో పేర్కొన్నారు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

నేలగల్లు రెడ్లు కులత్వానికి హత్యా రాజకీయాలకి చట్టం ముసుగులో న్యాయదేవత కళ్ళకు గంతలు కట్టగల సమర్థులుగా రచయిత చిత్రీకరించారు. రాయలసీమ ప్రజలను దోపిడీ చేస్తున్న పీడిస్తున్న అగ్రకుల రెడ్ల అధిపత్యానికి ప్రతీక. వారి విస్ళృంకలత్వం వారి పతనానికి దారితీసింది. తరతరాల అధిపత్యాన్ని కూలదోయటానికి బహుజనలంతా వర్షంలా ఏకమై తుఫానుగా మారి రెడ్డి బంగ్లా నిట్ట నిలువునా కూలిపోయేదాకా ఉద్యమించాలని ప్రతీకాత్మకంగా తెలియజేశారు. రెడ్డిబంగ్లా కూలిపోయినప్పటికీ దానిలో పనిచేసే సాలమ్మ, ఉతప్ప వాడుకునే గదులు మాత్రం తలెత్తుకుని నిలబడ్డాయి. ఆ పాత బంగ్లా అది పీడిత ప్రజల చైతన్యం వల్ల కూలిపోవాలని రచయిత ధ్వని. అనంతపురంలోని మాదిగ,మాల,బీసీ కులాలు, ముస్లిం మైనారిటీలంతా రెడ్డికుల ఫ్యాక్షనిజ పెత్తనం వల్ల బాధితులయ్యారు. అందుకే ఈ బహుజనలంతా ఏకమై సమిష్టిగా శిధిలస్థితిలో ఉన్న ఈ ఆధిపత్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమిస్తే ఆ వ్యవస్థ కూలిపోతుందని, ఆధిపత్యాలన్ని కూలిపోయి ఆత్మగౌరవంతో నిలబడి పీడుతులంతా సమానులవుతారని రచయిత ప్రతీకాత్మకంగా తెలియజేశారు.

**నవల విశిష్టత:** కవిత్వంలో ప్రతీకాత్మక చిత్రణ అనివార్యమైన విషయం. కథ, నవల ప్రక్రియలో ప్రతీక చాల లోతైన చర్చనీయాంశము. చాలాసార్లు ప్రతీక మెటాఫర్ గా మారిపోయి గొప్ప అర్థాలను ధ్వనిస్తూ ఉంటుంది. అనంతజీవనం అనే శీర్షిక కూడా అలాంటి ఒక మెటాఫర్ ఇన్ఫినిటీ ఆఫ్ లైఫ్ అనే అర్థం. అది జీవితానికి అంతం లేదనే తత్వం స్ఫూరింపజేస్తుంది. అలాగే నవలనిండా పరుచుకున్న వాన కూడా ఒక మెటాఫర్. అది బహుజన జాతుల్లో వెల్లువెత్తుతున్న ఉద్యమ చైతన్యానికి ప్రతీక. ఆ ఉద్యమచైతన్య ఉద్ధృతికి ఆధిపత్యకోటలు కూలిపోతున్నాయని అర్థం. ముఖ్యంగా యద్దీరప్ప సంఘమార్పుకు ప్రతినిధి. అతని ఐదుగురు భార్యలు కులసమాజంలోని వివిధ వర్గాలకు ప్రతినిధులు, ఆ వర్గాలను సమాదరిస్తున్న యద్దీరప్ప సమతా సిద్ధాంతానికి ఒక గుణాత్మక ప్రతీక. పాత సామాజిక జీవితంలోని ఆస్తిసంబంధాలు, కులసంబంధాలు తప్పకుండా మార్పుకు గురవుతాయని అనంతజీవనం మనకి బోధపరుస్తుంది.

**యద్దీరప్పపాత్ర** కొత్తసమాజానికి ప్రాతిపదిక ఏర్పాటు చేస్తున్నాడని పరోక్షకంగా మనకు తెలియజేస్తుంది. ఈ కోణం నుండి మనం యద్దీరప్ప పాత్రను అర్థం చేసుకోవాలి. యద్దీరప్పపాత్ర నవలలో చిన్నపాత్ర, కీలకమైన పాత్ర, ప్రతీకాత్మకంగా చెప్పబడిన పాత్ర. నవలలో నాలుగు ఐదుపేజీలలో మాత్రమే ఈ పాత్ర మనకి కనబడుతుంది. నవలంతా పరుచుకొని ఉన్న పాత్ర కాదు. అయినా ఈ పాత్రే కథానాయకుడని అనవచ్చు. ఎందుకంటే నవలలో రాంపి రెడ్డి తప్ప మిగిలిన పాత్రలని అలా వచ్చి ఇలా పోయేవే. వచ్చిన కష్టాలను ఇబ్బందులను ఎదుర్కొని ఆయా కాలాల్లో ఏ పాత్రకా పాత్ర వాటిని వ్యక్తిగతంగా అధిగమించడానికి ప్రయత్నించారు. కానీ యద్దీరప్ప పాత్ర తన వల్ల జరిగిన తప్పును తెలుసుకొని వ్యక్తిగతమైన అంశాలను సరిదిద్దుకోవాలని అనుకుంటాడు. ఇక్కడతో ఆగితే యద్దీరప్ప మిగిలిన పాత్ర లాగే మిగిలిపోయేవాడు. తన ఇల్లు

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

పడిపోవటంతో క్షణకాలం బిత్తరపోయిన వెంటనే తేరుకొని తాను కట్టిన,కడుతున్న ఇల్లన్నీ కలియతిరిగి యజమానుల యోగక్షేమాలు తెలుసుకున్నాడు. ఎక్కడ తన అవసరం ఉందో అక్కడ తన మనుషులను పెట్టి సరి చేయడానికి పూనుకున్నాడు. కాబట్టే ఇది గొప్ప పాత్రగా నిలబడింది.

యద్దీరప్పకు ఐదుగురుభార్యలు. సమాజంలోని ఐదు ప్రధానమైన వర్గాలకు ప్రతినిధులు. కొలకలూరి ఇనాక్ గారి 'ఆదిఆంధ్రుడు' కావ్యం లోని భుజంగరాయుడికి కూడా ఐదుగురు భార్యలున్నారు. ఆయన కూడా ఐదుగురిని సమాదరించారు. భుజంగరాయుడు పాత్రనుండే యద్దీరప్పపాత్రను నమూనగా రూపొందించేడేమోనని భావించవచ్చు.

**ముగింపు:** నీతి, నైతిక విలువలు లేక గోవిందరెడ్డి రాంపి రెడ్డి పతనమైన పోయిన తీరును రచయిత అత్యద్భుతంగా చిత్రించాడు. నీతి నైతిక విలువలతో యద్దీరప్పపాత్రను నైతికంగా ఎంతో ఉన్నతమైనదిగా ప్రతీకాత్మకంగా తెలియజేశారు. రచయిత ఎక్కడ అక్కర్లేని సందేశాలు ఇచ్చే పని చేయలేదు. పాత్రలు సందర్భాలే కథను నడిపిస్తాయి. పాత్రలు కథలోని వాతావరణం రెండు వేరువేరుగా ఉండవు. పాత్ర ప్రవర్తనే వాతావరణంగా వాతావరణమే చాలాసార్లు ఒక పాత్రగా మారిపోవటం ఈ నవల ప్రత్యేకత. శిల్పపరంగా కథాకథనం ఎత్తుగడల రీత్యా ఈ నవల చాలా గొప్పదని విమర్శకుల అభిప్రాయం.

**ఆధార గ్రంథాలు:**


1. ఇనాక్, కొలకలూరి: 2007 అనంతజీవనం, జ్యోతి గంధమాల, హైదరాబాద్.
2. ఇనాక్, కొలకలూరి:2011 ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సమాలోచన 'రాయలసీమ జనజీవనానికి చిత్రించిన అనంత జీవనం', జ్యోతి గ్రంథమాల, హైదరాబాద్.
3. మధుజ్యోతి, కొలకలూరి:2009 'ఆచార్య కొలకలూరి సాహిత్యం పై విమర్శనం', జ్యోతి గంధమాల, హైదరాబాద్.
4. మాధవి.బి.టీ:2011 ఆచార్య కొలకలూరు సాహితీ సమాలోచనం 'రాయలసీమ జనజీవనాన్ని చిత్రించిన అనంతజీవనం' జ్యోతి గ్రంథమాల, హైదరాబాద్.
5. వరప్రసాద్.బి:2011 అనంతజీవనంలోని జీవనతత్వం ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితి సమాలోచన జ్యోతి గ్రంథమాల హైదరాబాద్.
6. శ్రీకృష్ణ ,ఆకుల:2011 'వర్షంలోఅనంతపురం', ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితి సమాలోచనం, జ్యోతి గ్రంథమాల, హైదరాబాద్.
7. వెంకటసుబ్బయ్య,వల్లంపాటి:2006 రాయలసీమలో ఆధునిక సాహిత్యము సామాజిక సాంస్కృతిక విశ్లేషణ, మదనపల్లి.
8. సుందర్రాజు నాగప్పగారి (సం) :1997 మాదిగ చైతన్యం మాదిగ సాహిత్య వేదిక హైదరాబాద్